క్లుప్తంగా

వయోధికులను గౌరవించాలి



పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

కాగజ్‌నగర్‌రూరల్: వయోధికులను గౌరవించాలని, వారి ఆలనాపాలనా బాధ్యత పిల్లలదేనని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ప్రపంచ వయోధికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007–11 చట్టం ప్రకారం వయోధికుల హక్కులకు భంగం కలిగించరాదన్నారు. వయోధికులను సరిగా చూసుకోకపోతే శిక్షార్హులు అవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం కార్యదర్శి శివప్రసాద్, ఏఎస్ఆర్ మూర్తి, నారాయణ, కలికోట రమణయ్య, ఎల్లాగౌడ్, తూడూరు ప్రకాశ్, గుల్లపెల్లి నాగేశ్వర్‌రావు, పురుషోత్తం, కోటేశ్వర్‌రావు, భాస్కర్‌రెడ్డి, బాలరాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రుల్‌నగర్ విలేజ్ నెం.5 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని, విద్యుత్ వినియోగదారులు సమస్యలను వేదిక దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ఉత్తర తెలంగాణ ట్రాన్స్‌కో చైర్‌పర్సన్ రాధాకృష్ణతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. వినియోగదారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా కేంద్రంలో వర్షం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షంతో వాతావరణం చల్లబడి ఊరట కలిగింది. వేసవి ఎండల్లోనే పత్తి విత్తనాలు విత్తిన రైతులు గత కొన్ని రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

కైలాస్‌నగర్: ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో పనిచేసే ఉద్యోగి నాందేవ్ ఆత్మహత్యకు అక్కడి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేధింపులే కారణమని ఏఐఎస్ఎస్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ ఆరోపించారు. అందుకు బాధ్యుడైన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ని విధుల నుంచి సస్పెండ్ చేయాలని ప్రకటనలో డిమాండ్ చేశారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించడంతో పాటు న్యాయ నిపుణులతో కమిటీ వేసి విచారణ చేపట్టాలని కోరారు.

మాజీ మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం పరామర్శించారు. మాజీ మంత్రి సోదరుడు తలసాని శంకర్ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో హైదరాబాదులోని మాజీ మంత్రి నివాసంలో పరామర్శించారు. శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిన్నారి మృతికి అశ్రు నివాళి

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి గ్రామంలో ఆరేళ్ల వయస్సు గల చిన్నారిని గంజాయి మత్తులో ఎత్తుకెళ్లి, అత్యాచారం చేసి చంపిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ, ఆ చిన్నారి చిత్ర పటానికి పూలమాలలు వేసి రాముని చెరువు వాకర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం నివాళులర్పించారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులు రాజేందర్ రెడ్డి, భాస్కర్‌రావు, బూర్ల జ్ఞాని, సలహాదారులు డాక్టర్ త్రినాథరావు, డాక్టర్ సల్మాన్‌రాజు, జి.సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్, మొగిలి, రామప్రసాద్‌లు పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

నేరడిగొండ: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 210వ ర్యాంకు సాధించిన గిరిజన యువకుడు బుక్య విజయ్‌రాజ్‌ను సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సన్మానించారు. గిరిజన యువకుడు బుక్య విజయ్‌రాజ్ జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. గిరిజన యువకులు విద్య, ఉద్యోగాల్లో రాణించాలని సూచించారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

- గ్రామ పంచాయతీ నర్సరీల్లో పెంపకం
- ఈ ఏడాది 3.01 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- క్షేత్రస్థాయిలో సన్నద్ధమవుతున్న అధికారులు



తిర్యాణి నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఏపీవో షాకీర్ ఉస్మాని (ఫైల్)

తిర్యాణి: రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ప్రతీ ఏడాది వర్షకాలంలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు నిర్వహిస్తుంది. హరితహారంలో భాగంగా మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో ప్రత్యేకంగా నర్సరీలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలను సంబంధిత గ్రామపంచాయతీలకు ప్రభుత్వం అప్పగించింది. దీంతో పాటు ప్రత్యేకంగా మొక్కల సంరక్షణ కోసం గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వనసేవక్‌ను నియమించి సంరక్షణ బాధ్యతలు చేపడుతున్నారు.

లక్ష్యం చేరేలా..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 10వ విడుత హరితహారం కోసం మండలంలో ఏర్పాటు చేసిన 29 నర్సరీల్లో పెంచిన 3.01 లక్షల మొక్కలను అధికారులు సిద్ధం చేశారు. ఈ మొక్కలు ఎక్కువగా ఇంట్లో పెంచుకునేందుకు అనుకూలంగా ఉండే మామిడి, జామ, నిమ్మ, గులాబి, నేరేడు, సీతాఫల్, ఉసిరి, దానిమ్మ, బాదాం, మందార, మల్లె వంటి పండ్ల, పూల మొక్కలతో పాటుగా టేకు, గంధం, వెదురు, కానుగ, వేప, రావి, రేగి వంటి నీడనిచ్చే మొక్కలను సైతం నర్సరీల్లో పెంచుతున్నారు. హరితహారంలో భాగంగా గృహ సముదాయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు గ్రామ అంతర్గత రహదారుల పక్కన, పొలం గట్లు, చెరువులు, కుంటలు, పార్కులు, డంపింగ్ యార్డులు, కాల్వ గట్లపై మొక్కలు నాటనున్నారు. కాగా అధికారులు మొక్కలు నాటేందుకు అవసరమయ్యే స్థలాల గుర్తింపు చేపట్టడంతో పాటు మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతల తవ్వకాల పనులు చేపట్టనున్నారు. కాగా జిల్లాలో మరో 10 రోజుల్లో హరితహారం కార్యక్రమం నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

సిద్ధం చేస్తున్నాం

10వ విడుత హరితహారం కోసం మండలంలోని 29 నర్సరీలల్లో 3.01 లక్షల మొక్కలను సిద్ధం చేశాం. మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు స్థలాల గుర్తింపునకు చర్యలు చేపడుతున్నాం. మరో 10 రోజుల్లో హరితహారం చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నాం.

– షాకీర్ ఉస్మాని, ఏపీవో, తిర్యాణి

గిరిజన గ్రామాలకు అధ్వాన రోడ్లు



కునికాసా గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలు ఏర్పడి 50 ఏళ్లు అవుతున్నా.. పాలకులు కనీస సౌకర్యాలు కల్పించలేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నారు. చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడిగా మారి బైక్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గాదిగూడ మండలంలోని పర్సువాడ, కునికాసా, కొలంగూడ, గోండుగూడ, గాదిగూడ పున్నగూడ గ్రామాలకు రోడ్డుకు లేక కాలినడకన నడుచుకుంటూ.. వెళ్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఎడ్ల బండి సాయంతో ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి. అధికారులకు, పాలకులకు స్పందించి గిరిజన గ్రామాకలు రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం

నార్నూర్: గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. మండలంలోని మాన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజులగూడ గ్రామంలో తాగునీటి ట్యాంకు వద్ద మురుగు నీరు పేరుకుపోయింది. దీంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నీటి ట్యాంకు నుంచి నీరు లీకేజీ కావడంతో బురదగా మారుతోంది. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారిగా ఉన్న ఎంపీడీవో ఇప్పటివరకు గ్రామాన్ని సందర్శించిన దాఖాలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి ట్యాంకు వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

‘రామారావు మరణం తీరని లోటు’



నివాళులర్పిస్తున్న ఆత్రం సుగుణ

కెరమెరి: ఆదిమ గిరిజన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఒక మంచి ఉపాధ్యాయుడిని కోల్పోయామని, పర్చకి రామారావు ఆత్మకు శాంతి చేకూరాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు రామారావు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆమె సోమవారం సాకెడ(బి) గ్రామానికి చేరుకొని రామారావు భౌతికకాయం వద్ద నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీపీపీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మడపచ్చి అర్జున్, కనక వెంకటేశ్వర్‌రావు, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ నైతం నా ర్యన, చాహకటి శ్యాం‌రావు, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సుకోల జ్ఞానేశ్వర్, జిల్లా నాయకులు విశ్వనాథ్, నాణేశ్వర్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కెరమెరి: మండలంలోని సాకడా (బి) గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పరిచకి రామారావు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందజేసిన రూ. 20వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం మోడీ స్కూల్ కాంప్లెక్స్ నుంచి రామారావు కుటుంబ సభ్యులకు సిబ్బంది అందజేశారు. ఎస్‌సీఆర్పీ చాహకటి శ్యాంరావు, ఉపాధ్యాయులు గంగారాం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



ఆర్థికసాయం అందజేస్తున్న కోనప్ప

దహెగాం: మండల కేంద్రానికి చెందిన చిన్నారి సుల్తానాబాద్‌లో అత్యాచారం హత్యకు గురైన విషయం విదితమే. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే కోనప్ప అన్నారు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా చిన్నారి చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నాయకులు రావి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని పరామర్శించిన కోనప్ప

పెంచికల్‌పేట్: మండల కేంద్రానికి చెందిన చౌ దరి అరుణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా సోమవారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప యువకుడిని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, చింతలమానెపల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల రహదారి పనులు నిర్వహించడంతో రోడ్డు ఎత్తు పెరిగి విద్యుత్ తీగలు భూమికి చేరువగా వచ్చాయి. రహదారిపై వచ్చే బస్సులు, లారీలు ఇతర భారీ వాహనాలు ఎదురుగా వచ్చే సమయంలో విద్యుత్ తీగలు తగిలే ప్రమాదం ఉంది. ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేది లేదు’



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న రావి శ్రీనివాస్

బెజ్జూర్: భూవివాదాల్లో అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేది లేదని కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మర్దిడి శివారులోని సలుగుపల్లి వద్ద సోమవారం ఆయన మాట్లాడారు. భూవివాదం ఉన్న భూమిలో సర్వే చేపట్టి హద్దులు గుర్తించాలన్నారు. మర్దిడి శివారులోని ఓ భూమి వివాదాస్పదంగా మారిందని, రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. తహసీల్దార్‌తో మాట్లాడి సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేసేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, మండల అధ్యక్షుడు బుస శంకర్, శ్రీవర్ధన్, మార్కెట్ కమిటీ సభ్యుడు ఆత్రం రాజారాం, నాయకులు సకారాం, హకీం, లక్ష్మీనారాయణ, రమేశ్, పెంటయ్య, శంకర్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



కెరమెరి: చిన్నారుల ఆలింగనం



కెరమెరి: నమాజ్ చేస్తున్న ముస్లింలు

కెరమెరి: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని ముస్లింలు ఈద్–ఉల్–జుహ ఘనంగా జరుపుకున్నారు. గోయగాం, ధనోరా, సుర్దాపూర్, కెరమెరి, సుల్తాన్‌గూడకు చెందిన ముస్లింలు సుల్తాన్‌గూడలోని ఈద్గాతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న ఈద్గాల వద్దకు చేరుకొని నమాజ్ చేశారు. వైస్ ఎంపీపీ అబ్దుల్‌కలాం, ఆతీఫ్, నిసార్, సదర్ యూసుఫ్, నాయకులు మునీర్, సుజాయత్ ఖాన్, యూనుస్, కుత్‌బుద్దీన్, రజాక్, ఇలియాజ్, శంఖుఖాన్, జాహెద్‌ఖాన్, ఫరీద్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు. ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దహెగాం: మండల కేంద్రంతో పాటు బీబ్రా, కోత్మీర్, లగ్గాం, మొట్లగూడ తదితర గ్రామాల్లో సోమవారం ముస్లింలు బక్రీద్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా గ్రామాల్లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



బెజ్జూర్‌లో..

రెబ్బెన: మండలంలోని ముస్లింలు ఆదివారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు గోలేటిలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో హాఫీజ్ జావిద్ మసీదు కమిటీ అధ్యక్షుడు జహీర్ బాబా, ఉపాధ్యక్షుడు షంషీర్ అలీ, ప్రధాన కార్యదర్శి నాసీర్ ఉస్మానీ మత పెద్దలు అబ్దుల్ అజీజ్, నయీం, ఆరీఫ్, ఉబెదుల్లా తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో బక్రీద్ పండుగ పురస్కరించుకొని స్థానిక ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు మాట్లాడుతూ బక్రీద్ పండుగ విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు ప్రతీక అన్నారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

బెజ్జూర్: త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను సోమవారం మండలంలోని బెజ్జూర్, కుకుడ, ఎలుకపల్లి, మర్దిడి, గోల్కొండ తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



దహెగాం: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రెబ్బెన: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పెంచికల్‌పేట్: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ధర్నా విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ నెల 24న నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు కొట్రంగి శారద అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం కల్పించాలన్నారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, కోడి గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న చేపట్టే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, సీఐటీయూ మండల కన్వీనర్ మోర్లె నాగేశ్, కార్మికులు లక్ష్మి, పద్మ, వనిత, విమల, మాయ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి మృతితో విషాదం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ పే అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న బంగారి విజయ్(47) ప్రమాదవశాత్తు ఎల్ఎండీ జలాశయంలో మునిగి చెందడంతో విషాదం నెలకొంది. కరీంనగర్‌లోని సంతోష్‌నగర్‌కు చెందిన ఆయన కొన్నేళ్లుగా ఆసిఫాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. వరుసగా రెండురోజులు సెలవులు రావడంతో కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వెళ్లారు. ఫొటో దిగుతూ జలాశయంలో పడిన కుమార్తెను కాపాడే క్రమంలో నీట మునిగి మృతి చెందారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

ఇంద్రవెల్లి: గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని మారుతిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మారుతిగూడ గ్రామానికి చెందిన గోడం నాగోరావ్ (58) వాల్గొండ హీరపూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీలో 2009 నుంచి 2014 వరకు సర్పంచ్‌గా సేవలందించారు. 2020 నుంచి హీరపూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్‌గా సేవలందించారు. సోమవారం తెల్లవారుజమున ఛాతినొప్పి రావడంతో కుటుంబసభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఎంపీ గోడం నగేశ్, ప్రజాప్రతినిధులు మారుతిగూడ గ్రామానికి చేరుకొని భౌతికాయానికి పూలమాల వేసి శ్రద్ధంజలి ఘట్టించారు.